స్టార్ రేంజ్







ఆ రేంజే వేరు.. !

అవును ఈ మాట అచ్చం **గాజువాకకు సరిపోతుంది.** పారిశ్రామిక నగరంగా గుర్తింపు పొందిన జనవాక సౌకర్యాల కల్పనలోనూ దూసుకుపోతుంది. వివిధ ప్రాంతాల వాసులను అక్కున చేర్చుకుంది. తలసరి ఆదాయంలో టాప్‌గేర్‌లో ఉంది. దీంతో గాజువాకలో నక్షత్రహోటళ్లు ఒదిగి పోయాయి. ఇక్కడి ప్రజల జిహ్వ చాపల్యం తీర్చుకోవడానికి చెంతనే ఫుడ్‌కోర్టులు వచ్చేశాయి. దీంతో గాజువాక స్టార్ రేంజ్‌కు ఎదిగింది. – గాజువాక

- వాలిన నక్షత్ర హోటళ్లు
- అందుబాటులో పిజ్జా, బర్గర్, ఫ్రైడ్ చికెన్‌లు
- కొలువు దీరిన ఫుడ్ కోర్టులు
- మారిన పారిశ్రామిక నగరం రూపురేఖలు

సుపీరియర్ సౌకర్యాలతో కూడిన బోర్డింగ్ కోసం ఇప్పుడు నగరంలోని స్టార్ హోటళ్లకు వెళ్లాల్సిన అవసరం లేదు. సకల సౌకర్యాలతో డీలక్స్, సూట్ రూమ్‌లు ఇప్పుడు గాజువాకలోనే లభిస్తున్నాయి. నోరూరించే ఇండియన్ డిష్‌లు, ఆహా అనిపించే చైనీస్, తందూరి, థాయ్ కుజిన్స్... లాబ్‌స్టర్స్, ఫిష్ పామ్‌ఫ్రెట్ తదితర సీఫుడ్స్.. థాయ్, డ్రాగన్ సూప్ అండ్ స్టార్టర్స్.. ఇలాంటి వంటకాలూ ఇక్కడే రుచి చూడవచ్చు. సౌకర్యాలతో కూడిన నక్షత్ర హోటళ్లు అందుబాటులోకి వచ్చాయి. పిజ్జా, బర్గర్, ఫ్రైడ్ చికెన్‌లు ఇక్కడే దొరుకుతున్నాయి.

వాణిజ్య.. పారిశ్రామికం కలబోత

భారీ పరిశ్రమలతో పాటు వందల సంఖ్యలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రావడంతో వాణిజ్య, వ్యాపార సంస్థలు కూడా పెద్ద ఎత్తున వచ్చాయి. దీంతో ఏటేటా జనాభా పెరుగుతోంది. వారందరి అవసరాలు తీర్చే విధంగా ఇక్కడ సకల సౌకర్యాలు కలిగిన హోటళ్లు సైతం విస్తరిస్తున్నాయి.

పదేళ్లలో మారిన రూపురేఖలు

గతంలో ఇక్కడ త్రీస్టార్ రేటింగ్‌తో ఒకే హోటల్ ఉండేది. పదేళ్ల కిందట ఇండియన్, చైనీస్, థాయ్ తదితర డిష్‌లతో ఓ హోటల్ ప్రారంభమైంది. ఇప్పుడు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన త్రీస్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు అందుబాటులోకి వచ్చాయి. షీలానగర్ మొదలుకొని ఆటోనగర్, గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో ఈ స్థాయి హోటళ్లు ఇటీవల ఎక్కువగా కొలువుదీరాయి. పూర్తి ఏసీ సౌకర్యం కలిగిన హోటళ్లు గాజువాకలోనే పది వరకు ఏర్పాటయ్యాయి. నగరంలో ఇప్పటికే ప్రాచుర్యం పొందిన కొన్ని స్టార్ హోటళ్లు తమ బ్రాంచ్‌లను ఇటీవల కాలంలో గాజువాకకు విస్తరించారు.



గాజువాకలోని ఓ హోటల్‌లో ఆహార పదార్థాలు తయారు చేస్తున్న చెఫ్



రెస్టారెంట్‌లో అతిథులు

నోరూరించే వంటకాలు

రెస్టారెంట్లు సైతం బాగా విస్తరించాయి. యువత ఇష్టపడే వివిధ రకాల రుచులతో రెస్టారెంట్లు, అంతర్జాతీయ సంస్థలకు అనుబంధంగా ఉన్న రెస్టారెంట్లుకొలువుతీరాయి. ప్రత్యేకంగా చికెన్‌తో తయారు చేసే వివిధ వెరైటీల ఫుడ్ ఐటెమ్‌లు ఇప్పుడు గాజువాక ప్రాంతంలో ఎక్కడికక్కడ అందుబాటులో ఉన్నాయి. నగరంలోని స్టార్ హోటళ్లలో లభించే ఆహార పదార్థాల నాణ్యత, ప్రమాణాలకు దీటుగా ఇక్కడ కూడా వివిధ రకాల ఆహారపదార్థాలు అందుబాటులో ఉండడంతో గాజువాక వాసులు నగరం వైపు చూడడం లేదంటే అతిశయోక్తి కాదు.

వీకెండ్స్‌లో బఫెట్ హంగామా

వీకెండ్స్‌లో ప్రత్యేక ఫుడ్‌తో బఫెట్ సౌకర్యాన్ని వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో వారాంతాల్లో ఫుడ్‌కోర్టులు, రెస్టారెంట్లు కిటకిటలాడుతున్నాయి. ఇవిగాక సాధారణ హోటళ్లు మరో 25 వరకు ఉన్నాయి. వీటికి బిర్యానీ పాయింట్లు, దాబాలు అదనం. గాజువాక పట్టణంలో మరో 30 వరకు పార్సిల్ కౌంటర్లు ఉంటాయని అంచనా.



ఆకట్టుకునే వేదికలు

వీటితోపాటు వివిధ ఫంక్షన్లు నిర్వహించుకొనేందుకు వీలుగా స్టార్ రేటింగ్ కలిగిన హోటళ్లలో ఫంక్షన్ హాళ్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ ఫంక్షన్ హాళ్లకు కూడా ప్రజల నుంచి అనూహ్య ఆదరణ లభిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

చెంతనే కోరుకున్న ఫుడ్



గాజువాకలో పదేళ్ల కిందటతో పోల్చితే ఇప్పుడు మంచి మంచి హోటళ్లు ఏర్పాటయ్యాయి. అన్ని రకాల సౌకర్యాలతో స్టార్ హోటళ్లు, అంతర్జాతీయ ప్రమాణాలతో రెస్టారెంట్లు వచ్చాయి. కోరుకున్న ఫుడ్ దొరుకుతోంది. మంచి ఆహారం కోసం నగరంలోకి వెళ్లాల్సిన పని లేకుండా పోయింది. గాజువాకలో ఇలాంటి సౌకర్యాలు రావడం సంతోషంగా ఉంది.

– పి.రజనీ కుమార్, గాజువాక

ఆఫర్లు బాగుంటాయి



సుమారు అన్ని రెస్టారెంట్లలోమంచి ఆహారం లభిస్తోంది. చాలా హైజీన్‌గా తయారు చేసి ఇస్తున్నారు. అంతర్జాతీయ బ్రాండ్‌ల రెస్టారెంట్లలో ఓపెన్ కిచెన్ ఉండటం వల్ల వారు ఎలా తయారు చేస్తున్నారో చూడడానికి అవకాశం ఏర్పడుతుంది. వారు ప్రతి వారం ఇచ్చే ఆఫర్లకు పిల్లలు చాలా ఆకర్షితులవుతున్నారు.

– విజయ్ కుమార్, గాజువాక

1న బహుజన ధర్నా



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు అన్వేష్, సత్యం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వచ్చే నెల ఒకటో తేదీన నిర్వహించ తలపెట్టిన బహుజన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ నాయకులు అన్వేష్, సత్యం కోరారు. కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు రిలే దీక్షా శిబిరం ఆవరణలో శుక్రవారం ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలనే కుట్రలు మానుకొని, ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు పెద్ద ఎత్తున హాజరయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, వై.టి.దాస్, డేవిడ్ విల్లా రామ్మోహన్‌కుమార్, సురేష్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

అక్కిరెడ్డిపాలెం: మూసి ఉన్న షాపుల షట్టర్లు రాత్రి వేళ విరగ్గొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురికి కోర్టు సంవత్సరం జైలు శిక్ష విధించింది. గాజువాక క్రైం ఎస్‌ఐ మన్మథరావు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2024 జూన్‌లో గాజువాక, న్యూ పోర్టు, మహారాణిపేట, పెందుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి సమయాల్లో షాపుల షట్టర్లు విరగ్గొట్టి డబ్బులు దొంగిలించుకు పోయినట్టు కేసులునమోదయ్యాయి. నగర పోలీస్ కమిషనర్, క్రైం డీసీపీ ఆదేశాల ప్రకారం సౌత్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు,గాజువాక క్రైం ఎస్‌ఐ మన్మథరావు దర్యాప్తు చేపట్టి దొంగతనాలకు పాల్పడుతున్న చిత్తరాపు అభిషేక్, కంగమ్ హరి గణేష్, జువ్వాక అశోక్ అనే ముగ్గురిని అరెస్ట్ చేశారు. గాజువాక మూడో ఏసీ ఎంఎం జడ్జి పల్లవి విచారణ అనంతరం ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

క్లుప్తంగా

డ్రై డేతో వ్యాధులు దూరం



నాతయ్యపాలెంలో డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మలేరియా అధికారులు తెలిపారు. 69వ వార్డు నాతయ్యపాలెం సీఎస్‌ఆర్ కల్యాణ మండపం వద్ద శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు డ్రై డే – ఫ్రై డేపై అవగాహన కల్పించారు. మలేరియా సిబ్బంది దోమల వ్యాప్తి వల్ల డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్, పాలథిన్ కవర్ల వినియోగం వల్ల అనర్థాలను వివరించారు. మలేరియా, శానిటరీ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల విజేతలను సత్కరిస్తున్న ప్రతినిధులు

అగనంపూడి: రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను శుక్రవారం ప్రేరణ అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీసెస్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. 85వ వార్డు కొండయ్యవలస ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన ఎం.జె.సాయి, రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన ఆర్ సుదర్శన్‌లను అసోసియేషన్ కార్యదర్శి బి.శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అప్పారావు, నాయకులు బి.సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు, బి.చందు, పి.పద్మ, వీణ, నాగమణి పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గాజువాక: స్థానిక చైతన్య మహిళా కళాశాలలో శుక్రవారం మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పుష్పగిరి నేత్ర వైద్యాలయం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీపీ, సుగర్, ఈసీజీ, క్యాన్సర్ పరీక్షలు, వీ డెంటల్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. 400 మంది విద్యార్థులతో పాటు స్థానికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి తెలిపారు. 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ ప్రారంభించిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు సంతోషిని దేవి, వై.వి.ఎన్.లక్ష్మి, పావని తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక కోతలపై మండిపాటు

అగనంపూడి: ఏపీఈపీడీసీఎల్ అధికారులు తీరుపై 86వ వార్డు వుడా ఫేజ్–1 కాలనీవాసులు మండిపడుతున్నారు. శుక్రవారం కనీస ముందస్తు సమాచారం లేకుండా ఉదయం నుంచి సాయంత్రం ఐదున్నర వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహణ పనులు చేపట్టే సందర్భంలో ముందస్తుగా అధికారులు సామాజిక మాధ్యమాలు, ఇతర మాధ్యమాల్లో వినియోగదారులకు సమాచారం తెలియజేస్తుంటారు. అయితే శుక్రవారం ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా రోజంతా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వినియోగదారులు అధికారులపై మండిపడుతున్నారు. అధికారుల వ్యవహారంపై కాలనీ అసోసియేషన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించాలి



మోడల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి సుభోద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి, ఆర్థిక సలహాదారు సుభోద్ కుమార్ సింగ్ శుక్రవారం స్టీల్‌ప్లాంట్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉక్కు పరిపాలన భవనంలో కార్మిక సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ మొదట దశ 3.0 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మించగా ఉద్యోగుల కష్టం వల్ల 3.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించిన విషయాన్ని కార్యదర్శి దృష్టికి తెచ్చారు. రా మెటీరియల్ ఏర్పాటు చేస్తూ పూర్తి ఉత్పత్తి చేయడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. వేతన ఒప్పందం చేయకపోగా ఉన్న ఆర్థిక సదుపాయాల్లో చాలా వాటికి కోత పెట్టారన్నారు. వెంటనే జీతాలు సక్రమంగా చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. అంతకు ముందు ఆదనపు కార్యదర్శి స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్, అవార్డు గ్యాలరీలు సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఉత్పత్తి యూనిట్లలో పర్యటించి ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సీఎండీ ఎ.కె. సక్సేనా, డైరెక్టర్లతో పాటు కె.ఎస్.ఎన్. రావు (ఏఐటీయూసీ), మంత్రి రాజశేఖర్, కారు రమణ (ఐఎన్‌టీయూసీ), జె. అయోధ్యరామ్, యు. రామస్వామి (సీఐటీయూ)లు పాల్గొన్నారు.

నవీన్‌కుమార్ పనితీరు ఆదర్శవంతం



ఉక్కు ఆస్పత్రివిభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి విభాగాధిపతిగా, వైద్యునిగా డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్ అందించిన సేవలు ఆదర్శనీయమని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. డాక్టర్ నవీన్‌కుమార్ శనివారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా యూనియన్ నాయకులు ఆయన్ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఆయన వైద్యుడిగా రోగులకు, విభాగాధిపతిగా ఆస్పత్రి అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మిగతా వైద్యులు నవీన్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సన్మానగ్రహీత నవీన్‌కుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన సహ వైద్యులు, యాజమాన్యం, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, బి.టి. జగదీష్, ఆకుల నూకరాజు, రమణమూర్తి, గోపాలకృష్ణ, కారు రమణ, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ. నాయుడు, జి.వి. సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన నలుగురు సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఎస్‌ఐ కె.ధర్మారావు, ఆర్‌ఎస్‌ఐ ఎస్.మురళీకృష్ణ, ఏఆర్‌ఎస్‌ఐ (వీఆర్) కె.గురయ్యబాబు, హెచ్‌సీ ఆర్.ఎస్.రామచంద్రరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సీపీ వారిని కుటుంబ సభ్యులతో సమావేశ మందిరానికి ఆహ్వానించారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు. సిబ్బందికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపి, వారి కుటుంబ సభ్యులు, ఉన్నతాధికారుల సమక్షంలో సన్మానించారు.

ఖోఖో పోటీల విజేత ఏఎంఏఎల్ కళాశాల

విశాఖ విద్య: ఏయూ అంతర్ కళాశాలల ఖోఖో పోటీల విజేతగా అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల నిలిచింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా ఈ పోటీలు జరిగాయి. 28 కళాశాలలకు చెందిన 16 జట్లు విజయం కోసం హోరాహోరీగా తలపడగా.. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇదే స్ఫూర్తితో ఏయూ ఖోఖో జట్టు జాతీయస్థాయిలో రాణించాలని క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

ఓం నమో శివ రుద్రాయ

- భక్తి శ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు
- రుద్రాభిషేకాలు, అన్న సమారాధనలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు వాసుదేవ శర్మ



అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఉక్కు బీసీ గేటు శివాలయంలో లక్షబిల్వార్చన

పెదగంట్యాడ: శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాస శివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తెల్లవారు జాము నుంచి ఆలయాలకు చేరుకున్నారు. జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువు ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు వాసుదేవ శర్మ అధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. మణిద్వీప వర్ణన పారాయణ భక్తులచే నిర్వహించారు.అభిషేకం అనంతరం బిల్వార్చన చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో..

హౌసింగ్ బోర్డు కాలనీలో వాసవీ పంచాయతన ఆలయంలో ముక్కంటికి భక్తులు స్వయంగా అభిషేకాలు, పుష్పార్చన చేశారు. సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు.



భక్తిగీతాలు ఆలపిస్తున్న గాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు ఆర్ఎస్సీ జాబిలీ హిల్స్ కాలనీలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవాం మాస శివరాత్రి పూజలు వైభవంగా నిర్వహించారు. మహా శివునికి రుద్రాభిషేకం జరిపించారు. ఆలయ అర్చకులు ఆంజనేయులు భక్తులతో విశేష పూజలు, అభిషేకాలు చేయించారు. మధ్యాహ్నం నిర్వహించిన వనసమారాధనలో కాలనీ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం కోటిదీపోత్సవం భక్తిశ్రద్ధలతో జరిపించారు. సురేష్ దంపతులతో పాటు అసోసియేషన్ ప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు శివాలయంలో లక్ష బిల్వార్చన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు శివాలయంలో లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రి సందర్భంగా రుత్వికుల ఆధ్వర్యంలో మహాశివునికి పూజలు చేశారు. అనంతరం పంచామృత అభిషేకాలు నిర్వహించారు.ఆలయ ఆవరణలో హోమం, శివపార్వతుల కల్యాణం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రునాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, బి. శశిభూషణరావు, నాగభూషణం, చీకటి శ్రీనివాస్, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



జాబిలీ హిల్స్‌లో పూజలు చేస్తున్న భక్తులు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



వనభోజనంలో సందడి



దీపారాధనలో పాల్గొన్న మహిళలు

'కేంద్రం అసమర్థతే ఉక్కు నష్టాలకు కారణం'

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వ అసమర్థతే విశాఖ ఉక్కు నష్టాలకు కారణమని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్టు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి, ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి లకే రాజారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరిగితే దానికి రాష్ట్రంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలే పూర్తి బాధ్యత వహించాలని, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక అయిన విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయబోమని ప్రధాని మోదీ నుంచి తెలుగు ప్రజలకు స్పష్టమైన హామీని ఇప్పించే బాధ్యత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌దే అన్నారు. లేనిచో తెలుగు ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తే 50 వేల మంది కార్మికులకు ప్రత్యక్షంగా, 5 లక్షల మందికి పరోక్షంగా నష్టం జరుగుతుందన్నారు. నష్టానికి గురయ్యే వారంతా బహుజన కుటుంబాలకు చెందిన వారేనని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ పేరిట మూసేసి రిజర్వేషన్లు లేకుండా చేయడమే ఈ ప్రభుత్వాల కుట్ర అని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ బీఎస్పీ చేపట్టిన బహుజన ధర్నాలో రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్ పాల్గొంటున్నట్టు తెలిపారు. ఉక్కు సంరక్షణ ఉద్యమంలో కార్మికులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.